
కళింకోట ప్రభాకరదేవ్

# కొత్త పంచె



బద్ధకంగా మంచంమీదనుండి లేచి వొళ్లు విరుచుకున్నాడు సుందర్రావ్. టేబులు మీద వున్న గడియారంవైపు చూశాడు. ఎనిమిదయింది. ప్రతిరోజు ఏడుగంటలకే బెడ్‌కాఫీతో సుప్రభాతం పాడే జానకి ఈ దినం ఎనిమిదిగంట లయినా తనను నిద్ర లేపలేదేం చెప్మా అనుకుంటూ వంటగదిలోకి నడిచాడు.

వంటయింట్లో పప్పు రుబ్బుతుంది జానకి. సుందర్రావ్ రావటం చూసి చిన్నగా నవ్వింది. డైనింగ్ టేబులు దగ్గరనున్న కుర్చీని జానకికి దగ్గరగా లాక్కుని కూర్చున్నాడు సుందర్రావ్.

"ఏమిటి విశేషం? ఎనిమిదిగంట లయినా దేవిగారు బెడ్‌కాఫీ ప్రసాదించ లేదు" అన్నాడు నవ్వుతూ.

జానకి పప్పురుబ్బటం కాస్సేపు ఆపి, సుందర్రావ్ వైపు చూసింది. "ఈ దినం మావగారి మొదటి సంవత్స రీకం" అంది. జానకి మాటలకు సుంద

్రావ్ గతుక్కుమన్నాడు. తండ్రి చని పోయి అప్పుడే సంవత్సరం అయి పోయిందన్న విషయం గుర్తుకు రాగానే మనసంతా విచారంతో నిండిపోయింది. స్కూలు మాష్టరుగా పనిచేసి, ఎన్నో కష్టాలను ఎదుర్కొని తండ్రి తనను ఎమ్మే వరకూ చదివించాడు. తండ్రి గురించి ఆలోచనలతో సుందర్రావ్ కళ్ళు చెమ్మగిల్లాయి.

కుర్చీలోనుండి భారంగా లేచి, బాత్ రూంలోకి వెళ్ళి కాలకృత్యాలు ముగించు కుని వచ్చి, బీరువాలోనుండి యిస్త్రీ చేసిన బట్టలు తీసి కట్టుకున్నాడు. న్యూస్ పేపరు పట్టుకుని కుర్చీలో కూల బడ్డాడు.

జానకి పప్పురుబ్బటం పూర్తిగావిం చింది

"ఈ దినం ఆఫీసుకు సెలవు పెట్టండి" అంది భర్తతో జానకి. మౌనంగా తలాడించాడు సుందర్రావ్.

పనిమనిషి పైడమ్మ వచ్చి యిల్లు తుడువసాగింది. సిగరెట్ వెలిగించుకుని కుర్చీలోనుండి లేచాడు సుందర్రావ్.

"జానకి! రామారావు దగ్గరకు వెళ్ళి సెలవు చీటి యిచ్చి వస్తాను" అన్నాడు. రామారావు పక్క వీధిలో వుంటున్నాడు. సుందర్రావ్, రామారావు ఒకే ఆఫీసులో పని చేస్తున్నారు.

"వెళ్ళి రండి. అన్నట్లు మరిచాను. మావగారికి సేమ్యాపాయసం అంటే చాలా యిష్టం. ఇంట్లో సేమ్యా అయి పోయింది. వస్తున్నప్పుడు ఒక సేమ్యా పొట్లాం కొనుక్కురండి." చెప్పింది జానకి. అలాగే అన్నట్లు తలాడించాడు సుందర్రావ్. చెప్పులు తొడుక్కుని బయలుదేరబోతుంటే వెనక్కు పిలిచింది జానకి.

"చెప్పడం మరిచాను, మొదటి సంవత్సరీకం గదా! కొత్త బట్టలు పెట్టాలి. వస్తున్నప్పుడు కొత్త పంచె తీసుకురండి. గ్లాస్కో పంచె అయితే బాగుంటుంది. మావగారు ఆ పంచెలంటే తెగ మోజుపడేవారు" అంది.

"అలాగే జానకి! తెస్తాను." అన్నాడు సుందర్రావ్. తండ్రి స్మృతు లతో అతని మనసుబాగా కలతచెందింది. బరువెక్కిన మనసుతో వీధిలోకి నడి చాడు.

ఇల్లు తుడుస్తున్న పనిమనిషి పైడమ్మ జానకి సుందర్రావ్‌తో అన్న మాటలకు ఆశ్చర్యపోయింది.

'ఈ అమ్మగారికి మావగారంటే ఎంత ప్రేమ!' అనుకుని బుగ్గన వ్రేలేసుకుంది.

మావగారిమీద జానకికిగల ప్రేమాభి మానాలు పైడమ్మకు తెలియనివి కావు. రెండు సంవత్సరాలనుండి పైడమ్మ జానకి యింట్లో పనిచేస్తుంది.

'బ్రతికి వున్నప్పుడు లేని ప్రేమ చచ్చిపోయిన తరువాత వచ్చేసింది




కాబోలు! చచ్చి ఏ స్వర్గాన వున్నాడో గాని మహానుభావుడు కోడలు చేసే అవమానాలను కిక్కురు మనకుండా సహించేవాడు. కొడుకు దగ్గర కోడలి ప్రవర్తన గురించి పల్లెత్తు మాటకూడా అనేవాడు కాదు. అభిమానం గల మనిషి. కోడలి ప్రవర్తనకు మనసులోపలే కుమిలిపోయేవాడు.' పైడమ్మ ఆలోచనలతో యిల్లు తుడవడం పూర్తిచేసి చీపురును తలుపు మూల వుంచింది.

"పైడమ్మా! బియ్యం నానేసి వుంచాను, త్వరగా దంచు." వంటింట్లో నుండి కేకవేసింది జానకి. పైడమ్మ చేతులు కడుక్కొని వచ్చి వంటింట్లో బియ్యం దంచసాగింది.

తల స్నానం చేసి, మడిబట్టంతో పరమాన్నం వండుతున్న జానకిని చూస్తుంటే, పైడమ్మకు గతం గుర్తుకు రాసాగింది.

'మావగారి తద్దినానికి ఎంత శ్రద్ధ చూపిస్తుంది! బ్రతికి వున్నప్పుడు చిక్కని కాఫీని కూడా యిచ్చేది కాదు. మావగారికి యిచ్చే కాఫీ కషాయం నీళ్ళ లాగ వుండేది. తిండి దగ్గర సరేసరి. కొడుకు ఆఫీసుకు వెళ్ళిపోయేవాడు. ఇంటిదగ్గర జరుగుతున్న తతంగం గురించి ఆ బాబుకు ఏం తెలుస్తుంది? మావగారికి పచ్చడి మెతుకులు పెట్టేది. బ్రతికి వున్నప్పుడు మావగారికి కడుపు నిండా ఒక్కరోజైనా మనస్ఫూర్తిగా




మంచి భోజనం పెట్టలేదుగాని, చనిపోయేక మాత్రం సేమ్యాపాయసం చేస్తుంది. మహాయిల్లాలు!' కసిగా అనుకుంది పైటమ్మ.

సుందర్రావ్ వీధిలోనుండి వచ్చేడు.

సేమ్యాపొట్లాన్ని, బట్టల ప్యాకెట్టును భార్యకు యిచ్చేడు.


జానకి సేమ్యాపొట్లాన్ని పక్కన పెట్టి, బట్టల ప్యాకెట్‌ను ఆతృతగా విప్పి చూసింది. మల్లెపువ్వులాంటి తెల్లదనంతో కొత్త గ్లాస్కోపంచె! —

"ఎంతకు కొన్నారండి?" అడిగింది భర్తను.

"నలభై రూపాయలు."

"బాగుందండి." సంతృప్తిని వెలిబుచ్చింది జానకి.

సుందర్రావ్ అలసటగా కుర్చీలో కూర్చున్నాడు.




బియ్యం దంచుతున్న పైడమ్మ జానకి చేతిలోని గ్లాస్కోపంచెను చూసి, భారంగా నిట్టూర్చింది. గతంలో జరిగిన ఒక సంఘటన గుర్తుకువచ్చి మనసు కలుక్కుమంది.

"ఒకసారి నూతిదగ్గర తనుసీళ్లతోడు తుంది. జానకి మావగారు "పైడమ్మా!" అని పిలిచారు. తను వెళ్ళింది

"ఈ పంచెను కాస్తంత వుతికిపెట్టు" అన్నారు,

నూతిదగ్గర ఆ పంచెను తను వుతక సాగింది

పంచెనిండా మాసికలే!

ఇంతలో జానకి విసురుగా వచ్చింది.

"ఎవరిదే ఆ పంచె?" గుడ్లెర్రజేస్తూ అడిగింది.

"మీ మావగారిదమ్మా!"

"అడ్డమైనవాళ్ళ బట్టలు వుతకడానికి కాదు నిన్ను పన్లో పెట్టుకుంది. అర్థం టుగా నీళ్ళతోడి బాత్‌రూంలో పెట్టు." అంటూ మండిపడింది.

కోడలి కేకలను విన్న మావగారు నెమ్మదిగా వచ్చి, పంచెను తీసుకుని తనే వుతుక్కున్నారు

గతం గుర్తుకు రాగా, జానకిని చూసి చిన్నగా గొణుక్కుంది పైడమ్మ.

"నీరసంగా వున్నారు కాఫీ తాగుతారా?" అని అడిగింది భర్తను జానకి.

తల అడ్డంగా ఆడించాడు సుందర్రావ్.

"వద్దు జానకి! ముందు వంటపని.

చూడు" అన్నాడు. సిగరెట్ వెలిగించు కొని, గుండెనిండా పొగపీల్చి వదిలాడు.

"ఏమండి! మెయిలు పదకొండు గంటలకు వస్తుంది కదూ?"

"అవును."

"ఈరోజు మా నాన్న వస్తానన్నారు కదండి! ఒకసారి, మీరలాగ స్టేషనుకు వెళ్ళకూడదూ..." అంది.

"...అలాగే జానకి! వెళ్తాను" చెప్పులు తొడుక్కొని. ఎంతో స్టేషనుకు బయలుదేరాడు సుందర్రావ్.

* * *

తద్దినం పెట్టడం జరిగిపోయింది.

సుందర్రావ్ తండ్రిగురించిన ఆలోచనలతో బరువెక్కిన మనసుతో, కళ్ళు మూసుకుని మంచంమీద పడుకున్నాడు. జానకి భోజనానికి పిలిచిందిగాని తినాలనిపించలేదు సుందర్రావ్‌కి.

తండ్రికి పీటవేసి, చేసిన పిండివంటలను కొసరి కొసరి వడ్డించింది జానకి. రాఘవయ్య కడుపునిండా, తృప్తిగా తిన్నాడు. కూతురు యిచ్చిన సేమ్యా పాయిసాన్ని తాగి 'బ్రేవ్' మంటూ త్రేన్చాడు.

"బాగా చేశావమ్మా!" అన్నాడు ప్రశంసగా.

"మీకు సేమ్యాపాయసం అంటే యిష్టంకదా నాన్నా! అందుకని స్పెషల్‌గా చేశాను," అంది జానకి.

కూతురి అభిమానానికి తబ్బిబ్బు అయ్యాడు రాఘవయ్య. చేతులు కడుక్కొని, వక్కపొడిని నములుతూ భుక్తాయాసంతో వాలుకుర్చీలో నడుం వాల్చేడు.

"నాన్నా! ఈ పంచెను కట్టుకోండి" అంది జానకి. సరిక్రొత్త గ్లాస్కోపంచెను చూసి ఆశ్చర్యం చెందేడు రాఘవయ్య.

"ఇది... కొత్త పంచెమ్మా!"సందేహంగా అన్నాడు.

"అవును నాన్నా! గ్లాస్కోపంచెలంటే మీకు యిష్టం కదా! అందుకని, తెప్పించాను." మావగారి తద్దినానికకి రెండు గంటలక్రితం తెప్పించిన గ్లాస్కోపంచెను తండ్రికి యిచ్చింది జానకి.

చాలీ చాలని జీతందో, పెళ్ళికెదిగిన ముగ్గురు ఆడపిల్లలతో, మంచండిగని అనారోగ్యపు అర్ధాంగితో, అడుగడుగునా ఆర్థిక సమస్యలతో సతమతమవుతూ, మల్లుపంచెను కూడా కొనుక్కోవడానికి శక్తి చాలని రాఘవయ్య వణికే చేతులతో, చెమ్మగిల్లిన కళ్ళతో కూతురు యిచ్చిన గ్లాస్కోపంచెను ఆప్యాయంగా గుండెకు హత్తుకున్నాడు.

Printed and Published by A. Chandra Seker Rao at 5-9-88, Public Garden Road Hyderabad, for YUVA Publications and Printed at Dolton Press, Public Garden Road, Hyderabad-500 001. Editor : A. SUDHAKARA RAO